క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు

భువనగిరి: పట్టణంలోని బాగాయత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం రెడ్‌క్రాస్ సొసైటీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ సొసైటీ పట్టణ కమిటీ చైర్మన్ పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో విద్యుత్ డీఈ వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు సీహెచ్ సత్యనారాయణ, సభ్యులు సీహెచ్ రాజు, జిట్టా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ


ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న పూజ

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలోని గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారి పూజ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్, ఎరువులు పరిశీలించారు. రైతులకు నాణ్యమైన ఎరువులు విక్రయించాలని, ఎమ్మార్పీ ధరకే అమ్మాలని సూచించారు. ఆమె వెంట ఏఈఓ మనీష ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

ఆత్మకూరు(ఎం): మండలంలోని రహీంఖాన్‌పేటలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో చంద్రశేఖర్, మత్స్యగిరి మృతిచెందారు. బాధిత కుటుంబాలకు ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి రూ. 20వేల ఆర్థికసాయాన్ని ప్రకటించారు. ఈ సాయాన్ని కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కొప్పు శ్రీశైలం, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ తాల్లపెల్లి స్వామి, దేవాలయ కమిటీ చైర్మన్ బూరుగు వెంకటేష్ తదితరులున్నారు.

ధర్నా కరపత్రాల ఆవిష్కరణ

బీబీనగర్: మదర్ డెయిరీ, విజయ డెయిరీలు పాడి రైతులకు పెండింగ్‌లో ఉన్న రూ.85కోట్లు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈనెల 11న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నారు. ఈమేరకు బుధవారం బీబీనగర్ మండల కేంద్రంలో ధర్నా కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి, నాయకులు గాడి శ్రీనివాస్, అచ్చాలు, కుమార్, రాజు, సత్తయ్య పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

వలిగొండ : కుంభం ఫౌండేషన్, హైదరాబాద్‌లోని శంకర నేత్రాలయం ఆధ్వర్యంలో బుధవారం వలిగొండ మండల కేంద్రంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా 150 మందికి కంటి పరీక్షలు చేశారు. 60 మందికి ఆపరేషన్ అవసరమని వైద్యులు సూచించడంతో హైదరాబాద్‌లోని శంకర ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్, పాశం సత్తిరెడ్డి, కంకల కృష్ణయ్య, కాసుల వెంకన్న, కొండూరు సాయి, మైసొల్ల ప్రవీణ్, బత్తిని వరుణ్ పాల్గొన్నారు.

పంట రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

మోత్కూరు: మోత్కూరులోని నాగార్జున రైతు సేవా సహకార సంఘంలో కొత్తగా పంట రుణాలు తీసుకునేందుకు ఈ నెల 10వ తేదీలోగా రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఆ సంఘం చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంట రుణం తీసుకున్న వారు ప్రతి ఆరు నెలలకు ఒకసారి తమ అప్పును 7 శాతం సాధారణ వడ్డీతో చెల్లించాలని సూచించారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న సంఘం సభ్యులు

ఆలేరురూరల్: ఆలేరు పట్టణానికి చెందిన కాసుల హరిబాబు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి మండల ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘం తరుపున రూ.1,65,000 బుధవారం అందజేశారు. వారిలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు యామల అప్పలరెడ్డి, కోశాధికారి బీమిడి మాధవరెడ్డి, జిల్లా అధ్యక్షులు బోగ చంద్రశేఖర్, బొమ్మగాని గణేష్, చిల్లా హరిబాబు, తునిని దశరథ, ప్రభాకర్, రాయపురం నర్సింహులు, శ్రీనివాస్, నరేష్, దాస్ రాజేష్, శేఖర్, శివ తదితరులున్నారు.

ప్రారంభానికి నోచుకోని పీహెచ్‌సీ

- రూ.కోటి 56లక్షలతో భవన నిర్మాణం
- విద్యుత్, ప్లంబింగ్ పనుల పూర్తికి నిధుల లేమి


పీహెచ్‌సీ నూతన భవనం

బీబీనగర్: బీబీనగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు. భవనం నిర్మాణం పూర్తయినా ఆస్పత్రి ఆవరణలో చిన్నాచితక పనులు మిగిలి ఉన్నాయి. సదరు కాంట్రాక్టర్‌కు నిధులు విడుదల కాని కారణంగా భవనం బయట పనులతో పాటు లోపల ఫ్లోరింగ్ పనులు నిలిపివేసినట్లు తెలుస్తోంది.

ఆధునిక వసతులతో నిర్మాణం

పాత పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరడంతోపాటు, లోతట్టు ప్రదేశంలో ఉండడంతో అటు రోగులు ఇటు సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ వస్తున్నారు. దీంతో పాత భవనాన్ని కూల్చివేసి అదే స్థలంలో నూతన పీహెచ్‌సీ భవనాన్ని చేపట్టారు. ప్రస్తుతం పీహెచ్‌సీ మహిళా సమాఖ్య భవనంలో కొనసాగిస్తున్నారు. 1000 గజాల పీహెచ్‌సీ ప్రాంగణ స్థలంలోని 3,500 ఫీట్ల విస్తీర్ణంలో భవనం నిర్మాణం జరుగుతుండగా ఇందులో సుమారు 20పడకలకు పైగా సామర్థ్యం, శాంపిల్స్ సేకరణ గది, ల్యాబ్ గది, ఫార్మసిస్టు గది, ఇద్దరు డాక్టర్లకు గదులు, రోగులకు వెయిటింగ్ హాల్, మీటింగ్ హాల్ తదితర వాటిని ఆధునిక వసతులతో నిర్మించారు. కానీ పలు పనులు పెండింగ్‌లో ఉండడంతో ప్రారంభానికి నోచుకోవడం లేదు.

విద్యుత్, ప్లంబింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి



పీహెచ్‌సీ భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. విద్యుత్, ప్లంబింగ్ పనులకు ఇంకా నిధులు అదనంగా అవసరం కానున్నాయి. దీంతో కాంట్రాక్టర్ మిగిలిన పనులు పూర్తి చేయాల్సి ఉంది. దీంతో భవనం ప్రారంభించడం లేదు.

– నర్సింహారెడ్డి, పీఆర్ ఏఈ

పద్మశాలి మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


పద్మశాలి సంఘం మహాసభల వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న జిల్లా అధ్యక్షుడు చిక్క వెంకటేశ్వర్లు

ఆత్మకూరు(ఎం): హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఈ నెల 9న నిర్వహించే పద్మశాలి సంఘం 9వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్క వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం ఆత్మకూరు మండల కేంద్రంలో పద్మశాలీ మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు ఎలగందుల మహేష్, ప్రధాన కార్యదర్శి గాడిపెల్లి ఉదయ్‌కుమార్, నాయకులు సుల్తాన్ పురుషోత్తం, రచ్చ గోవర్ధన్, గర్దాసు లింగయ్య, రచ్చ భిక్షపతి, దేవదాసు, నల్ల దయానందం, రచ్చ రమేష్, బొజ్జ వెంకటేష్ పాల్గొన్నారు.

మోత్కూరులో..

మోత్కూరు : హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈ నెల 9న జరిగే అఖిల భారత పద్మశాలీ మహా సభ సందర్భంగా హలో పద్మశాలి.. చలో హైదరాబాద్ వాల్ పోస్టర్లను బుధవారం మోత్కూరులో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కా వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. చేనేత సంఘం నాయకుల సమస్యలు, సంఘం ఐక్యతను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు.

పంచాయతీ కార్మికులకు ఐడీ కార్డులు అందజేత


పంచాయతీ కార్మికులకు ఐడీ కార్డులు అందజేస్తున్న ఎంపీడీఓ జితేందర్ రెడ్డి

వలిగొండ: మండలంలో పనిచేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులకు గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి చేతుల మీదుగా బుధవారం ఐడీ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తుర్కపల్లి సురేందర్ మాట్లాడుతూ... ప్రభుత్వాలు ఎన్ని మారినా గ్రామపంచాయతీ కార్మికుల బతుకుల్లో మార్పు రావడంలేదని, వారి సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. ఈ నెల 7న ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎడవల్లి ఎల్లమయ్య, కొండే నరసింహ, గంగాపురం సురేందర్, ఉక్కుర్తి రాములు, బోడ వెంకటేశం, కందుల లింగస్వామి, సూరారం మధు, చెరుకు అంజయ్య, పోలేపాక లలిత, పావురాల శీను, కలుకూరి స్వామి, నీలం రాజు, రాములు, ఎల్లంకి స్వామి, ఉక్కుర్తి పుష్ప, రేణుక, శ్రీరాములు సాయిలు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం


బహుమతులు పొందిన క్రీడాకారులు

మోత్కూరు: క్రీడలు స్నేహభావం, మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని మోత్కూరు, అడ్డగూడూరు, యాదగిరిగుట్ట ఎస్‌ఐలు నాగరాజు, ఉదయ్‌కుమార్, నాగరాజు అన్నారు. మోత్కూరు షటిల్ క్లబ్, ఇండోర్ షటిల్ క్లబ్ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన షటిల్ టోర్నమెంట్స్ విజేతలకు బుధవారం మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బహుమతులు ప్రదానం చేశారు. రిటైర్డ్ టీచర్ మర్రి రామస్వామి జ్ఞాపకార్థం వారి కుమారుడు మర్రి అనిల్‌కుమార్ షీల్డులు అందజేశారు. కార్యక్రమంలో క్రీడాకారులు వెలిమినేటి జహంగీర్, మద్ది సోమేశ్వర్, బయ్యని నర్సింహ, లింగస్వామి, పోచం సోమయ్య, కాపర్తి సైమన్, జాషువా, ఆదిత్య, అశోక్, గోల్డ్ రవి, ముశం శ్రీను పాల్గొన్నారు.

యాంటీ ర్యాగింగ్, సైబర్ క్రైంపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ బృందం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు బాలికలు, మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, యాంటీ ర్యాగింగ్, సైబర్ క్రైమ్ వంటి వాటిపై ఏహెచ్‌టీయూ (యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్) ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అంతకు ముందు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏహెచ్‌టీయూ మహిళా కానిస్టేబుల్ లలిత, ఎస్పీఓ అరుణరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శరత్ యామినీ మాట్లాడుతూ.. మహిళలకు కొత్తగా పొందుపరిచిన చట్టాలను వివరించినట్లు తెలిపారు. మహిళలు ఒంటరిగా ఆటోలు, బస్సుల్లో ప్రయాణం చేసే సమయాల్లో ఏదైనా అనుమానంగా అనిపిస్తే వెంటనే 100కు డయల్ చేయాలని సూచించారు. మహిళలు, యువతులు, విద్యార్థినులు ఆపద సమయాల్లో తమను తాము రక్షించుకునేందుకు ధైర్యంగా ముందుకు సాగాలని తెలిపారు.

గోదావరి జలాలు విడుదల చేయాలి


పురుగుల మందు డబ్బాలతో నిరసన తెలుపుతున్న రైతులు

అడ్డగూడూరు: బిక్కేరు వాగులోకి గోదావరి జలాలు మరో పది రోజులపాటు విడుదల చేయాలని అడ్డగూడూరు మండల పరిధిలోని జానకిపురం గ్రామ రైతులు బుధవారం ఎండుతున్న వరి చేనులో పురుగుల మందు డబ్బాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ యాసంగిలో పంటకు నీరు వస్తుందని వరి పంట సాగు చేశామని, కానీ బిక్కేరు వాగులోకి నీరు రాకపోవడంతో చిన్నపడిశాల, జానకిపురం, చిర్రగూడూరు, కోటమర్తి గ్రామంలోని వరి పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వెంకటయ్య, పంజాల అంజయ్య, అంబటి సమ్మయ్య, చింత వెంటకయ్య, బోనాల అశోక్, బాబు, పంగిడియ్య, శ్రీకాంత్, నవీన్, వెంకన్న పాల్గొన్నారు.

కనులపండువగా రథోత్సవం


రథంపై స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

భూదాన్‌పోచంపల్లి: మున్సిపాలిటీ పరిధిలోని శ్రీగంగా పార్వతీ సమేత శ్రీ బసవ లింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం రథోత్సవంతో ముగిశాయి. సాయంత్రం దిష్టికుంభం, చక్రవర్తి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ ఏనుగు మహిపాల్‌రెడ్డి, ధర్మకర్తలు వనం లక్ష్మణ్, కర్నాటి పురుషోత్తం, సిద్దగోని మహేశ్, నోముల యాదిరెడ్డి, మైసగోని మహేశ్, కొండమడుగు చంద్రయ్య, కప్పలప్రేమ్‌కుమార్, జింకల జయసూర్య, గాజుల కళావతి, యాదయ్య, ఉత్సవకమిటీ నాయకులు పాల్గొన్నారు.

10వ తేదీ నుంచి ప్రజా చైతన్య కళాయాత్ర

భువనగిరిటౌన్: ఈనెల 10వ తేదీ నుంచి 25 వరకు నిర్వహించనున్న ప్రజానాట్యమండలి ప్రజా చైతన్య యాత్రను జయప్రదం చేయాలని పీఎస్‌ఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అవ్వారు గోవర్ధన్ కోరారు. మంగళవారం భువనగిరిలోని సుందరయ్య భవన్‌లో ప్రజా చైతన్య కళాయాత్ర పోస్టర్‌ను ప్రజానాట్య మండల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో ప్రజాసమస్యలపై పోరాడే అభ్యర్థులను గెలిపించాలన్నారు. పీఎస్‌ఎం జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజలను చైతన్యం చేసేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రజా చైతన్య కళాయాత్ర నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గంటెపాక శివకుమార్, రాష్ట్ర కమిటీ సభ్యుడు దేశపాక రవి, జిల్లా ఉపాధ్యక్షులు కొలువుల వివేకానంద, గంటెపాక శ్రీకృష్ణ, తుర్కపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం


భూదాన్‌పోచంపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలోనికి వెళ్తున్న విద్యార్థినులు


చౌటుప్పల్‌లో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేసి లోపలికి అనుమతిస్తున్న సిబ్బంది


మోత్కూర్‌లో పరీక్షా కేంద్రం వద్ద హాల్‌టికెట్ నంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు

చౌటుప్పల్, వలిగొండ, భూదాన్‌పోచంపల్లి, రామన్నపేట, యాదగిరిగుట్ట, బొమ్మలరామారం: ఇంటర్ ప్రథమ సంవత్సరం వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. చౌటుప్పల్‌లో తెలంగాణ బాలికల గురుకుల కళాశాల, తెలంగాణ మోడల్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీగాయత్రి జూనియర్ కళాశాల, ప్రతిభ ఒకేషనల్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటి రోజు 1045 మంది విద్యార్థులకుగాను 990 మంది హాజరయ్యారు. వలిగొండ మండల వ్యాప్తంగా 305 మందికి గాను 292 మంది హాజరైనట్లు వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్ కుమార్ తెలిపారు. రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో మొత్తం 239 మంది విద్యార్థులకు గాను 227మంది పరీక్షకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ ప్రసూనాదేవి తెలిపారు. కాగా.. భూదాన్‌పోచంపల్లి పట్టణ కేంద్రంలో ఉదయం వేళలో బస్సు సౌకర్యం లేక గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవడానికి ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 136 మంది విద్యార్థులకు గాను నలుగురు, మోడల్ స్కూల్ కేంద్రంలో 158 మంది విద్యార్థులకు ఇద్దరు గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్లు జ్యోతి, నవీన్‌కుమార్ తెలిపారు. యాదగిరిగుట్ట మున్సిపాలిటీలోని యాదగిరిపల్లిలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి రోజు పరీక్షకు 168 మంది హాజరు కావాల్సి ఉండగా.. 162 మంది హాజరయ్యారు. ఆరుగురు విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ బలరాం వెల్లడించారు. బొమ్మలరామారంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 408 విద్యార్థులకు గాను 9 మంది గైర్హాజరయ్యారు. మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో 253 మందికి 16 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా మొదటి రోజు 25 మంది హాజరుకాలేదు.

అయ్యో.. అన్నదాత


పశువుల మేత కోసం ఎండిపోయిన వరి చేనును కోస్తున్న రైతు

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండలం తుక్కాపురం గ్రామానికి చెందిన రైతు చిక్కిరి రవికి ఏడెకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో ఆరు ఎకరాల్లో వరి నాటు పెట్టాడు. ఇందుకు పెట్టుబడి రూ.2.50లక్షలు అయ్యింది. రూ.3లక్షలతో మూడు బోర్లు వేశాడు. భూగర్భజలాలు అడుగంటడంతో ప్రస్తుతం బోర్లు పోస్తలేవు. దీంతో నాలుగు ఎకరాల్లో వరి చేను ఎండిపోయింది. ఎండిపోయిన వరి పంటను పశువుల మేత కోసం కోస్తున్నాడు.

'సామేల్ మతిభ్రమించి మాట్లాడుతున్నారు'

మోత్కూరు: మందుల సామేల్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పొన్నబోయిన రమేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాకూబ్‌రెడ్డి అన్నారు. బుధవారం మోత్కూరులో వారు మాట్లాడారు. ప్రాంతం కోసం పదవులను త్యాగం చేసిన కేసీఆర్, హరీష్‌రావులు ఎక్కడ? పదవుల కోసం పార్టీ మారి గెలిచిన తరువాత పదవులనే అమ్ముకునే తమరు ఎక్కడ అని సామేల్‌ను తీవ్రంగా విమర్శించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ పట్టణ కార్యదర్శి గజ్జి మల్లేషం, నాయకులు పానుగుల్ల విష్ణుమూర్తి, కొండా సోంమల్లు పాల్గొన్నారు.

ఉత్సవాల నిర్వాహకులకు సన్మానం

చౌటుప్పల్: స్థానిక శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో గత 51ఏళ్లుగా శివరాత్రి ఉత్సవాలను తమ సొంత ఖర్చులతో వైభవంగా నిర్వహిస్తున్న పట్టణ కేంద్రానికి చెందిన ఉప్పల కృష్ణ-కుసుమ, కేదారినాథ్-దీపిక దంపతులను దేవాలయ మాజీ అభివృద్ధి కమిటీ సభ్యులు బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో దేవాలయ మాజీ అధ్యక్షుడు దేవరపల్లి గోవర్ధన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, ప్రతినిధులు గుజ్జుల సురేందర్‌రెడ్డి, దండ అరుణ్‌కుమార్, ఊడుగు మల్లేష్, అన్నెబోయిన గోవిందరాజు, తాడూరి పరమేష్, కాంశెట్టి భాస్కర్, దాడి సురేందర్‌రెడ్డి, నల్ల పర్వతాలు, జక్కర్తి శేఖర్, పస్తం గంగరాములు, పిల్లలమర్రి యాదగిరి, బొడ్డు రాజేందర్‌రెడ్డి, కాంశెట్టి మణితేజ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాటం


ర్యాలీ నిర్వహిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

భువనగిరి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పోరాటం కొనసాగిస్తామని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు కుంట్ల అమరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మధుసూదన్ అన్నారు. ఉమ్మడి నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లా టీచర్స్ ఎమ్మెల్సీగా పీఆర్‌టీయూ టీఎస్ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి విజయం సాధించడంతో బుధవారం భువనగిరిలోని హైదరాబాద్ చౌరస్తా వద్ద విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉపేందర్‌రావు, మోహన్‌రావు, మందాడి వెంకట్‌రెడ్డి, యామిని, నిర్మల, నారాయణ, వెంకటేశ్వర్లు, స్వామిరాజ్, మల్లేశం పాల్గొన్నారు.

చెరువుకు హద్దురాళ్లు ఏర్పాటు చేయాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న సంఘం సభ్యులు

రామన్నపేట: రామన్నపేటలోని వెంకట్రామయ్య చెరువుకు హద్దురాళ్లు ఏర్పాటు చేసి చెరువును పరిరక్షించాలని కోరుతూ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు బుధవారం రామన్నపేట తహసీల్దార్ లాల్‌బహదూర్‌కు వినతిపత్రం అందజేశారు. వారిలో సహకార సంఘం అధ్యక్షుడు కందుల హనుమంతు, కార్యదర్శి పిట్టల మత్స్యగిరి, డైరెక్టర్లు దేపాక రాజు, మాజీ డైరెక్టర్ బచ్చ రాములు, సాదుల యాదగిరి, మహిళా సొసైటీ ఉపాధ్యక్షురాలు రేపాల పోచమ్మ, డైరెక్టర్ కందుల లలిత, రాములమ్మ, లక్ష్మమ్మ, భాగ్యమ్మ, ఇందిరమ్మ, పద్మ, నర్సమ్మ పాల్గొన్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

మోత్కూరు: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను 25 శాతం రాయితీతో క్రమబద్ధీకరణ చేస్తున్నట్లు, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మోత్కూరు మున్సిపల్ కమిషనర్ సతీష్‌కుమార్ కోరారు. బుధవారం మోత్కూరు మున్సిపల్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులపై సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2020లో రూ.1000 చెల్లించి ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులు 25 శాతం రాయితీతో ఫీజు చెల్లించి తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని తెలిపారు. ఈ అవకాశం ఈ నెల 31వ తేదీ వరకు కల్పించినట్లు చెప్పారు. సమావేశంలో మేనేజర్ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

వరి పంటల పరిశీలన

భువనగిరి: ఎండిపోయిన వరి పంటకు ఎకరానికి రూ.20వేల చొప్పున చెల్లించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దయ్యాల నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోరుబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం భువనగిరి మండలంలోని హన్మాపురం గ్రామంలో ఎండిన వరి పంటను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హన్మాపురం గ్రామ పరిధిలోనే సుమారు 60 ఎకరాల్లో వరి పంట ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి అంజయ్య, కార్యదర్శి ఎల్లయ్య, రైతులు ఉన్నారు.

మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

యాదగిరిగుట్ట: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ కోరారు. బుధవారం యాదగిరిగుట్ట పట్టణంలో మహిళా సమాఖ్య ఆఫీస్ బేరర్ సమావేశం జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని మండలాల్లో మహిళా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మహిళా అధికారులను, మహిళా సంఘసంస్కర్తలను సన్మానించాలన్నారు. సమావేశంలో మాటూరు జానమ్మ, వడ్లకొండ భారతమ్మ, మూసుకుంట్ల నరసమ్మ, ఆరె పుష్ప, తొంట మాధవి, బోడ లక్ష్మి, మంచాల రాధమ్మ, మంచాల సువర్ణ తదితరులున్నారు.

వైభవంగా ధ్వజారోహణం

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని కనుముకుల గ్రామంలో శ్రీపద్మావతి సమేత, శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ధ్వజారోహణం వైభవంగా నిర్వహించారు. దేవాలయ నిర్మాణ ధర్మకర్తలు, మాజీ జెడ్పీటీసీ దంపతులు కోట పుష్పలత మల్లారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కోట సత్తిరెడ్డి, ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు పాక నర్సింహ, అధ్యక్షుడు కోట అంజిరెడ్డి, గట్టు పాండు రంగారెడ్డి, రంగ మధు, నూకల లింగస్వామి, భూపాల్‌రెడ్డి, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వపరిపాలన దినోత్సవం


భువనగిరి: పట్టణంలోని బీచ్‌మహల్లా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో విద్యార్థులు


రామన్నపేట: దుబ్బాకలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు


రాజాపేట: రఘునాథపురం ప్రాథమిక పాఠశాలలో స్వపరిపాలన వేడుకలు..


వలిగొండ : సంగం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు